
సాక్షి బాపట్ల

శుక్రవారం । 30 । మే । 2025



ఘనంగా అంకమ్మ తల్లి కొలుపులు

రొంపిచర్ల : స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో గురువారం కొలుపులు నిర్వహించారు ఆలయ ప్రతిష్ట జరిగి 41 రోజులు అయిన సందర్భంగా కొలుపులు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 512.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,598 క్యూసెక్కుల ఉ విడుదలవుతోంది.



కొనసాగుతున్న సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పున: పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో జరుగుతున్న ప్రత్యేక సదరం క్యాంపు గురువారం కొనసాగింది.

న్యూస్‌రీల్

అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్



గుంటూరు లీగల్: జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 29 నుంచి జూన్ 5వ తేదీ వరకు జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి గురువారం తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ బెంచ్ ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఈ బెంచ్ ద్వారా సివిల్ కేసులు (పార్టిషన్ సూట్స్, మనీ మేటర్స్, పర్మినెంట్ ఇంజక్షన్ సూట్స్, స్పెసిఫిక్ పెర్ఫార్మన్స్), రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇచ్చిన ఉత్తర్వు ప్రకారం కొన్ని రాజీ పడదగ్గ ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎల్ఏఓపీ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించటం జరుగుతుందన్నారు. కక్షిదారులు, పోలీస్, స్టేక్ హోల్డర్స్ అందరు ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా సహకరించాలని సూచించారు.

సినిమా థియేటర్ల తనిఖీ



చీరాల: చీరాల్లోని సినిమా థియేటర్లపై చీరాల ఆర్డీఓ టి.చంద్రశేఖర్ నాయుడు గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. గురువారం రాత్రి స్థానిక చీరాలలోని సినిమా థియేటర్లను ఆయన తహసీల్దార్ కె.గోపీకృష్ణతో కలిసి తనిఖీ చేశారు. థియేటర్‌లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అలానే థియేటర్‌లోని ఆహార పదార్థాల రేట్లను పరిశీలించారు. థియేటర్లకు అనుమతులు, ఫుడ్‌కు అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారా.. ఫుడ్ క్వాంటిటీ ప్రకారం రేట్లు ఉన్నాయా.. లేదా, సినిమా టికెట్ల ధరలు, టాయిలెట్స్ నిర్వహణను ఆయన పరిశీలన చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని సినిమా థియేటర్లను పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేయడం ఏమిటని థియేటర్ల యజమానులు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో రెవెన్యూ అధికారులు తనిఖీ చేస్తున్నారనే సందేహం కలుగుతుంది.

33 వాహనాలపై కేసులు నమోదు



నరసరావుపేట: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించాలన్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ, పోలీసు, రవాణా శాఖ అధికారులు గురువారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. పట్టణం నుంచి రావిపాడు, వినుకొండ, గుంటూరుకు వెళ్లే రోడ్లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న 33 ఆటోరిక్షా వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేశారు. వాటిలో ఏడింటిని సీజ్ చేశారు. సుమారు రూ.2.20 లక్షల అపరాధ రుసుం విధించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శివనాగేశ్వరరావు, ఎస్ఐ కిషోర్ తనిఖీల్లో పాల్గొన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, దీని వలన రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

నిలిచిన వర్షపు నీరు...



మంగళగిరి టౌన్: మంగళగిరిలో గురువారం అకాల వర్షం కురిసింది. నగరంలోని వీధులు జలమయమయ్యాయి. దేవస్థానం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్చ్ వద్ద ర్యాంప్ వేయడంతో వర్షపు నీరు నిలిచిపోయింది. రోడ్డు కంటే ర్యాంప్ ఎత్తుగా ఉండడంతో వర్షపు నీరు కాలువలోకి ప్రవహించ లేక అక్కడే నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీటితో పాటు మురుగు నీరు కూడా సమీపంలోని దుకాణాల్లోకి చేరడంతో ఇబ్బందులు పడ్డారు. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కొలువు రాదు.. కడుపు నిండదు

- నిరుద్యోగ భృతికి ఎగనామం
- ఎన్నికలప్పుడు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న చంద్రబాబు
- గద్దెనెక్కాక ఒక్క ఉద్యోగం కల్పించని వైనం
- డీఎస్సీ పేరుతో దగా
- ఇంటికొకరు అనుకున్నా జిల్లాలో 5 లక్షల మంది నిరుద్యోగులు
- ఆందోళనలో యువత
- వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- కూటమి పాలన తీరుపై యువత ఆగ్రహం

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన తీరు



జె. పంగులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఓఏల నిరసన కార్యక్రమాలు (ఫైల్)

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి,బాపట్ల: ఎన్నికల ముందు నిరుద్యోగులకు చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. అధికారం చేపట్టాక వారితో కన్నీరు పెట్టిస్తున్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న వాటికి పీకేసి ఉపాధిని దెబ్బతీస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి జూన్ 12 నాటికి ఏడాది పూర్తి కావస్తోంది. నిరుద్యోగులకు ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన బాటలో నిరుద్యోగులు

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ముగుస్తున్నా మాట నిలబెట్టుకోకపోవడంతో మోసపోయిన యువత ఆందోళన బాట పడుతోంది. మెగా డీఎస్సీ ప్రకటించాలని నిరుద్యోగులు పలుమార్లు ఆందోళనకు దిగారు. చిరకు అరకొర పోస్టులతో ప్రకటన చేసింది. వలంటీర్లు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. విధుల నుంచి తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతోపాటు కోర్టులను ఆశ్రయించారు.

ఊసేలేని భృతి

ఎన్నికల సమయంలో ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం వచ్చేవరకూ నెలకు రూ.3 వేలు భృతి ఇస్తానని ప్రకటించిన చంద్రబాబు గద్దెనెక్కి ఏడాదైనా దాని ఊసే ఎత్తడంలేదు. ఇంటికొకరికి నిరుద్యోగ భృతి అనుకుంటే నెలకు రూ.149.10 కోట్ల చొప్పున చెల్లించాల్సి వుంది. కానీ పైసా ఇవ్వలేదు. 2014లోనూ చంద్రబాబు ఇంటికొక ఉద్యోగం, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక ఎగనామం పెట్టారు.

ఇంటికొక నిరుద్యోగి

జిల్లాలో జిల్లాలో 459 గ్రామపంచాయతీల పరిధిలో 944 గ్రామాలు ఉండగా వాటి పరిధిలో 4,97,000 గృహాలు ఉన్నాయి. ఈ లెక్కన ఇంటికొకరు అనుకున్నా జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. వారంతా ఉద్యోగాలకోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇలా....

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వం చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించింది. జిల్లాలో 477 గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటుచేసి 5,247 ఉద్యోగాలు కల్పించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల పరిధిలో వేలాది మందికి వలంటీర్ ఉద్యోగాలు ఇచ్చింది. 348 హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి 348 ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాలు కల్పించింది. ఇవికాకుండా అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చింది. ఇక ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చింది. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచి వారి శ్రమను గుర్తించింది. ఇవి కాకుండా ఎంఎస్ఎంఈల ద్వారా జిల్లాలో 705 యూనిట్లు ఏర్పాటు చేసి వారికి రూ.110.69 కోట్ల మేర రాయితీలు కల్పించింది.

ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కూటమి ప్రభుత్వం చదువుకున్న యువతకు తక్షణం ఉద్యోగాలు కల్పించాలి. 20 లక్షల ఉద్యోగాలిస్తామన్న మాట నిలబెట్టుకోవాలి. మాటలు చెప్పి ఓట్లేయించుకున్న ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చి ఆ మాట నిలబెట్టుకోవాలి. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలి.

– మాచవరపు రవికుమార్, రాష్ట్రకార్యదర్శి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం

ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పిన మాటలు..

"అధికారంలోకి రాగానే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం... ఉద్యోగావకాశాలు రానివారికి నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందజేస్తాం...వలంటీర్లకు నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తాం ...ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం...కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తాం" అంటూ చంద్రబాబుతోపాటు కూటమి నేతలు ఊదరగొట్టారు.

అధికారంలోకి వచ్చిన తర్వాత...

అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలు పీకేశారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించారు. జీతాలు పెంచకపోగా వలంటీర్లను తొలగించారు. ఏడాది పాలక పూర్తవుతున్నా నేటికి జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదు. మెగా డీఎస్సీ ప్రకటించినా పోస్టులలో కోత పెట్టారు. గడువు పెంచాలన్న అభ్యర్థుల గోడు పట్టించుకోవడం లేదు. ఎండీయూ వాహనాలపై పనిచేస్తున్న వేలాది మందిని తొలగించి వారి ఉపాధికి గండికొట్టారు.

జగన్ పాలనలో కొలువులు... బాబు పాలనలో తొలగింపులు

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయ ఉద్యోగులు మొదలు, మద్యం దుకాణాల వరకూ వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి ఆదుకుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉన్న ఉద్యోగాలు ఊడబెరికి అందరినీ రోడ్డుపాలు చేశారు. ప్రధానంగా 459 మంది ఫీల్డ్‌అసిస్టెంట్ల ఉద్యోగాలు తొలగించారు. వీరు కాకుండా జిల్లా వ్యాప్తంగా 435 సచివాలయాల పరిధిలోని 5,220 మంది వలంటీర్లు, 300 మంది యానిమేటర్లు, 117 వైన్‌షాపుల్లో పనిచేస్తున్న 468 మందిని చిరుద్యోగులను సైతం తొలగించారు. వీరితోపాటు 250 మంది ఆశావర్కర్లు, 1500 మందికి పైగా మధ్యాహ్న భోజన వర్కర్ల ఉద్యోగాలు ఊడబెరికారు. 173 మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లను సైతం తొలగించారు. వందలాదిమంది పర్మినెంట్ రేషన్ డీలర్లను బెదిరించి రాజీనామాలు చేయించారు. వీరితోపాటు పలురకాల చిరుద్యోగుల ఉద్యోగాలు తొలగించారు. మొత్తంగా కూటమి పాలనరాగనే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ సంగతి దేవుడెరుగు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇచ్చిన వేలాదిమంది నిరుద్యోగుల ఉద్యోగాలను తొలగించారు.



రేషన్ బియ్యం వాహన ఆపరేటర్ల నిరసన

తోడికోడళ్ల మృతితో తెనాలిలో విషాదం

- బాపట్ల జిల్లాలో కారు ప్రమాదం
- ముగ్గురు మృత్యువాత



ఝాన్సీరాణి, సూర్యకుమారి, సరస్వతికుమారి (ఫైల్)

తెనాలిరూరల్: అరుణాచలేశ్వరుని దర్శనం కోసం బయలుదేరిన తోడికోడళ్లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తెనాలిలో విషాదం అలముకుంది. ఎంతో ఆప్యాయంగా ఉండే తోడికోడళ్ల బంధం మరణం లోనూ వీడలేదు. పట్టణానికి చెందిన కన్నెగంటి సూర్యకుమారి, కన్నెగంటి సరస్వతి కుమారి, కన్నెగంటి ఝాన్సీరాణిలు తోడికోడళ్లు. ఝాన్సీరాణి కుమారుడు నాగార్జున, ఆడపడుచు పార్వతితో కలిసి వీరు ముగ్గురు గురువారం అరుణాచలానికి కారులో పయనమయ్యారు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల సమీపంలోని జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురవడంతో ఝాన్సీరాణి అక్కడికక్కడే మృతి చెందింది. గాయాల పాలైన నలుగురిని ఒంగోలు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సూర్యకుమారి, సరస్వతి కుమారి కూడా ప్రాణాలు కోల్పోయారు. సూర్యకుమారి తన భర్త నరసింహారావుతో కలిసి ఇక్కడి కవిరాజపార్కు రోడ్డులో అక్షర గీత విద్యానికేతన్‌ను స్థాపించారు. సరస్వతికుమారి భర్త వెంకటేశ్వరరావు ఆర్మీలో పనిచేసి రిటైరై తెనాలిలో రెడీమేడ్ దుస్తుల వ్యాపారం ప్రారంభించారు. ఝాన్సీరాణి భర్త నాగేశ్వరరావు గాంధీచౌక్‌లో పారగాన్ వాచ్ కంపెనీ నిర్వహించేవారు. ముగ్గురు అన్నదమ్ములు గతంలోనే మృతి చెందారు. ఆప్యాయంగా ఉండే తోడి కోడళ్లు అరుణాచలం దర్శనం కోసం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తమ ఆడపడుచు పార్వతిని వెంటబెట్టుకుని ఝాన్సీరాణి కుమారుడు నాగార్జునతో కలిసి తమకు తెలిసిన వారి కారు తీసుకుని బయలుదేరారు. రోడ్డు ప్రమాదం రూపంలో వీరి కుటుంబాలను మృత్యువు కబళించింది. సూర్యకుమారికి ఇద్దరు కుమారులు ఉండగా. తెనాలి ప్రభుత్వ వైద్యశాల సమీపంలో తన కుటుంబంతో నివాసం ఉంటోంది. సరస్వతికుమారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కవిరాజపార్కు రోడ్డులో నివసిస్తున్నారు. ఝాన్సీరాణి పెద్దకుమారుడు గతంలో మృతి చెందగా, ప్రస్తుతం సుల్తానాబాద్ ఆలపాటి నగర్‌లోని సాయిబాబా ఆలయం వద్ద సాయి పథం అపార్ట్‌మెంట్‌లో చిన్న కుమారుడు నాగార్జున కుటుంబంతో కలసి నివసిస్తున్నారు. ముగ్గురు తోడికోడళ్లు మృతి చెందారన్న వార్త తెలియడంతో తెనాలిలో విషాదఛాయలు అలముకున్నాయి.

తిరుపతమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం

పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గురువారం పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన సుంకర శ్రీనివాసరావు, మాధురి దంపతులు రూ.50,116, సుంకర చెంచయ్య, బాయమ్మల పేరు మీద గోశాలలో గోవుల సంరక్షణకు రూ.50,116 ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ప్రధానార్చకులు గోపిబాబు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్య పదిలం

- జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి
- సంపద సృష్టి కేంద్రం సందర్శన
- సిబ్బంది తీరుపై ఆగ్రహం



దమ్మనవారిపాలెం సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

కర్లపాలెం: పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్య పదిలంగా ఉంటుందని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. దమ్మనవారిపాలెం సంపద సృష్టి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. గ్రామంలోని చెత్త తీసుకువచ్చి ఒక చోట గుట్టగా వేయటాన్ని చూసిన కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపద సృష్టి కేంద్రానికి తీసుకువస్తున్న చెత్తను ఎందుకు ప్రాసెసింగ్ చేయటం లేదని అధికారులను నిలదీశారు. తక్షణమే ప్రాసెసింగ్ పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ 350 గృహాలు ఉన్న గ్రామంలో చెత్తను తొలగించేందుకు క్లాప్‌మిత్రలు ఇద్దరే ఉండటం ఏమిటని జనాభా సంఖ్యను బట్టి క్లాప్‌మిత్రలను ఏర్పాటు చేసుకోవాలని డీపీవో ప్రభాకర్‌కు సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు వేరుగా, ఇనుప వస్తువులు వేరుగా, గాజు వస్తువులు వేరుగా భూమిలో కుళ్లిపోయే పదార్థాలు వేరుచేసి సంపద సృష్టించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ గరపసాల వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ సుందరమ్మ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి సునీత తదితరులు ఉన్నారు.

కాలువల మరమ్మతులు సక్రమంగా చేయాలి

పంట కాలువల పూడికతీత, మరమ్మతు పనులు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి జల వనరుల శాఖాధికారులను ఆదేశించారు. కర్లపాలెం మండలంలో రూ.12లక్షలతో చేపట్టిన పీటీ చానల్ మరమ్మతు పనులను గురువారం కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని పంట కాలువల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. వర్షాలు కురవకముందే పూర్తి చేయాలని తెలిపారు. జలవనరుల శాఖ ఎస్ఈ డి.వెంకటరత్నం, డీఈ జాకీర్, తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఆర్డీవో లవన్న తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడుతూ పరిశ్రమలను నిర్వహించుకోవాలి

జిల్లాలో పర్యావరణాన్ని కాపాడుతూ పరిశ్రమలను నిర్వహించుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆక్వా పరిశ్రమలు, రిసార్ట్స్ యజమానులు, హోటల్ యజమానులతో పర్యావరణ పరిరక్షణపై తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా పరిశ్రమల్లో విడుదల చేసిన వ్యర్థ పదార్థాలను నిల్వ చేయడానికి తప్పనిసరిగా అర ఎకరా భూమిని కేటాయించాలని చెప్పారు. ఆక్వా పరిశ్రమల్లో విడుదల చేసిన వ్యర్థ పదార్థాలను పంట కాలువలోకి విడుదల చేయకుండా కట్టడి చేయాలని చెప్పారు. ఇరిగేషన్ వనరులు దెబ్బతినకుండా పర్యావరణాన్ని కాపాడాలని యజమానులను కలెక్టర్ కోరారు. రొయ్య ప్రాసెసింగ్ యూనిట్లు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని యాజమాన్యానికి సూచించారు. రొయ్య ప్రాసెసింగ్ యూనిట్లు 45 రోజుల్లోగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఆక్వా యాచరీలు 20 ఉన్నాయని, వీటిలో ఏడింటికి లైసెన్స్‌లు లేవని అన్నారు. నెలరోజుల్లోగా లైసెన్సులు తీసుకోవాలని ఆదేశించారు. రిసార్ట్స్ యజమానులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి గాజు ప్లేట్లను, బాటిల్స్ వినియోగించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి, మత్స్య శాఖ జేడీ, జిల్లా పర్యాటక శాఖఅధికారి, పొల్యూషన్ బోర్డ్ అధికారులు పరిశ్రమలను, రిసార్ట్స్‌ను, హోటళ్లను జాయింట్‌గా పరిశీలన చేయా లని కలెక్టర్ ఆదేశించారు. డీపీఓ ప్రభాకర్, గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్ఈ అనంతరాజు, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామకృష్ణ, పొల్యూషన్ బోర్డ్ ఈఈ రాఘవరెడ్డి,ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్ ఉన్నారు.

అధైర్య పడొద్దు .. అండగా ఉంటాం..

- ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, నేతల బృందం
- రెంటపాళ్ల ఉపసర్పంచ్ నాగమల్లేశ్వరరావు కుటుంబానికి పరామర్శ
- జూన్ 3న రెంటపాళ్లకు వైఎస్ జగన్ రాక నేపథ్యంలో రూట్‌మ్యాప్ పరిశీలన



రెంటపాళ్లలో విగ్రహావిష్కరణ మందిరం వద్ద చర్చిస్తున్న ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి విడదల రజని, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ సుధీర్

సత్తెనపల్లి: "మీరేమీ ఇబ్బంది పడవద్దు, భయపడ వద్దు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీకు అండగా ఉన్నారు. మేమందరం మీకు తోడుగా ఉన్నాం.." అంటూ ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి విడదల రజిని, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయ కర్త గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో వారు గురువారం పర్యటించారు. ఏడాది క్రితం టీడీపీ, జనసేన నేతల దాడులు, పోలీసుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న రెంటపాళ్ల ఉపసర్పంచ్, వైఎస్సార్ సీపీ క్రియాశీలక నాయకుడు కొర్లకుంట శివనాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యాన్ని కలిగించారు. మృతుడు తండ్రి, పాకాలపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లుతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జూన్ 3న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెంటపాళ్ల గ్రామాన్ని సందర్శిస్తారని చెప్పారు. కొర్లకుంట శివనాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులర్పిస్తారన్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని పేర్కొన్నారు. ఈ క్రమంలో రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి, డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్ చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్ మీరాన్, సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, ఎంజీ ఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, ఇందూరి నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి(సత్తెనపల్లి టౌన్), వేపూరి శ్రీనివాసరావు (రాజుపాలెం), భవనం రాఘవరెడ్డి (నకరికల్లు), నక్కా శ్రీను(ముప్పాళ్ల), వైఎస్సార్ సీపీ నాయకులు బండి కోటినాగిరెడ్డి, ఏకుల మత్తయ్య, పల్లె గాబ్రియేలు, కోట ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,500 గరిష్టం : రూ. 2,300

మోడల్ ధర రూ. 1,900



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 360

కొమ్ములు : 221 బస్తాలు	(ధర రూ॥ల్లో)	
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,600	10,375	10,050

కాయలు : 139 బస్తాలు		
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,600	10,450	10,050

మొత్తం అమ్మకాలు : 270.00 క్వింటాళ్లు

–దుగ్గిరాల

హత్య కేసులో రిమాండ్

బల్లికురవ: మండలంలోని కొమ్మినేనివారి పాలెంలో గత ఏడాది అక్టోబర్ 4న జరిగిన హత్య కేసులో నిందితుడు పి. నారాయణ రెడ్డికి అద్దంకి కోర్టు న్యాయమూర్తి బుధవారం 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వై. నాగరాజు తెలిపారు. ఆస్తుల పంపకం విషయంలో గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పి. బాలకృష్ణారెడ్డి పై నారాయణరెడ్డి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ వివరించారు.

నాటుసారా స్వాధీనం

చీరాల: ఎక్సైజ్ పోలీసులు, రెవెన్యూ, చీరాల పోలీసులు గురువారం చీరాల మండలంలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో చీరాల రామ్‌నగర్‌లోని సాల్వేషన్ ఆర్మీ చర్చి దగ్గర దేవర ఎలీషా ఇంటి వద్ద ప్లాస్టిక్ క్యాన్‌లో ఉన్న ఎనిమిది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలానే 20 కేజీల కరక్కాయ, 0.250 గ్రాముల సూపర్ ఫాస్ఫేట్ స్వాధీనం చేసుకున్నారు. దేవర ఎలీషాను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు తెలిపారు.

బిల్లుల్లోనూ పచ్చపాతం

- బిల్లుల ప్రాసెసింగ్‌లో మున్సిపల్ అధికారుల తీరిది
- తమ అనుకునే వారికి మాత్రమే అత్యధిక ప్రాధాన్యత
- అవసరం లేదనుకున్న వారికైతే నెలల తరబడి పెండింగ్
- ఇటీవల సీఎం పర్యటనకు రూ.35 లక్షల విలువైన మొక్కలు
- ఎక్కడున్నాయో.. ఏమైపోయాయో కూడా తెలియని దుస్థితి
- రూ.35 లక్షల బిల్లుకు ఆగమేఘాలపై ప్రాసెస్ పూర్తి
- ఇంకా పెండింగ్‌లోనే ఏడాది క్రితం నాటి ఎన్నికల ఖర్చు బిల్లులు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారు. తమ అనుకునే కాంట్రాక్టర్ల బిల్లులు ప్రాసెస్ చేయడంలో చూపుతున్న ఉత్సాహం మాటల్లో చెప్పలేనిది. మిగతా కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల్లో మొండి చేయి చూపుతున్నారనేది జగమెరిగిన సత్యం .. గత ప్రభుత్వంలో రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లలో కొంత మందికి బిల్లులు చెల్లింపులు జరపకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులకు పర్సంటేజ్ రూపంలో ముడుపులు సమర్పించుకుంటే ఎప్పటి బిల్లు అయినా ప్రాసెస్ చేస్తున్నారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.



గుంటూరులోని నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: జనవరి 10వ తేదీన గుంటూరులో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు వచ్చారు. ఆయన పర్యటించే ప్రాంతం ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి చేబ్రోలు హనుమయ్య కంపెనీ వరకు రోడ్లు అందంగా కనిపించేందుకు షో మొక్కలు తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి రూ.35 లక్షలు వెచ్చించి తెప్పించారు. ఎన్ని తెప్పించారో.. ఎన్ని ఉన్నాయో నేటికీ నగరపాలక సంస్థ అధికారుల వద్ద లెక్క లేదు. అధికారులు చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మొక్కలు ఎక్కడున్నాయో ఎవరికి తెలియదు. కొన్ని మొక్కలు ఎండిపోయాయి. దీనిపై సాక్షిలో ఏప్రిల్ 13వ తేదీన 'ఎండిన మొక్కలు.. తేలని లెక్కలు' పేరిట కథనం ప్రచురితమైంది. సోషల్ మీడియాలో కూడా ఈ విషయం వైరల్‌గా మారింది. దీంతో ఎక్కడ ఈ బిల్లు ఆపితే ఎటువంటి ఇబ్బందులు వస్తాయో అని అప్పుడు ఏడీహెచ్‌గా పనిచేసిన శ్రీనివాస్‌ను సరెండర్ చేసి మరీ సదరు బిల్లు రూ.35లక్షలు ప్రాసెస్ చేసినట్లు సమాచారం.

ఖర్చుల బిల్లు వస్తే ఒట్టు

2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలక్షన్ రోజు పోలింగ్, తర్వాత కౌంటింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, బ్యారికేడింగ్, డిపార్ట్‌మెంట్ సిబ్బందికి సంబంధించిన భోజనాలు, టీ, కాఫీలు, స్నాక్స్, ఇతర స్టేషనరీ వంటి పనులు కాంట్రాక్టర్లు సుమారు 1.50 కోట్ల వర్కులు ఇంజినీరింగ్ అధికారుల హామీతో చేపట్టారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ బిల్లులను అధికారులు ప్రాసెస్ చేయకుండా పక్కన పెట్టారని పలువురు కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

వడ్డీలకు తీసుకొచ్చి...

కొంతమంది కాంట్రాక్టర్లు బ్యాంకుల్లో స్థలాలు, ఇళ్ల తనాఖాలు పెట్టి పనులు చేశారు. ఆ వర్కులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంకుల్లో తీసుకున్న రుణానికి వడ్డీ పడుతోంది. మరి కొంత మంది కాంట్రాక్టర్లు బయట వ్యక్తుల వద్ద నుంచి వడ్డీ కట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీని వలన తాము అప్పుల్లో కూరుకుపోతున్నామని బహిరంగంగానే వాపోతున్నారు. ఏదో విధంగా బిల్లు ప్రాసెస్ చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను వేడుకుంటున్నారు.

సిఫార్సులు.. పర్సంటేజీలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత సర్కారు హయాంలో చేసిన వర్కుల బిల్లులు ప్రాసెస్ చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చేసిన వర్కులకు మాత్రమే బిల్లులు ప్రాసెస్ అవుతున్నట్లు కాంట్రాక్టర్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఎవరైనా వడ్డీలు కట్టుకోలేక ఎమ్మెల్యేలకు, ఎంపీలకు ఎంతకొంత ముట్టజెప్పి సిఫార్సు చేయించుకుంటున్నారు. ఇక్కడ నగరపాలక సంస్థ అధికారులు కూడా పర్సంటేజీ ఇస్తేనే బిల్లు ప్రాసెస్ చేస్తామని చెబుతున్నారు. చేసేదేమీ లేక అధికారులు అడిగినంత ఇచ్చుకుని ప్రాసెస్ చేయించుకుంటున్నారు కాంట్రాక్టర్లు.

కమిషనర్ ఆదేశాల మేరకే చెల్లింపులు

ఎవరైనా కాంట్రాక్టర్ అత్యవసరం అని అడిగితే సదరు బిల్లుల చెల్లింపులు కమిషనర్ ఆదేశాల మేరకు ప్రాసెస్ చేస్తున్నాం.

– నమ్రత్‌కుమార్, అకౌంటెంట్

ఉచిత మోడల్ లాసెట్ పోస్టర్ ఆవిష్కరణ

నగరంపాలెం: లాసెట్ అభ్యర్థులకు ఉచిత మోడల్ లాసెట్ ఎంతగానో ఉపయోగకరమని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎండీ.బర్కత్ అలీ అన్నారు. ఏపీ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఉచిత మోడల్ లాసెట్ పోస్టర్‌ను గురువారం నగరంపాలెంలోని ఆయన కార్యాలయంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసెక్యూటర్స్ పల్లపు కృష్ణ, బి.కోటేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి ఎ.శేషగిరి రావులు ఆవిష్కరించారు. శేషగిరిరావు మాట్లాడుతూ ఈ పరీక్షను జూన్ ఒకటిన గుంటూరు శ్యామలానగర్ ఒకటో వీధిలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహిస్తామని అన్నారు. ఉదయం పది గంటలకు పరీక్ష మొదలువుతుందని, మరిన్ని వివరాలకు 8297483785 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కొండవీటి శ్రీనివాసరావు, కె.వీరభాస్కర్, న్యాయవాదులు కె.నారాయణ చిన్న, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ జవాన్‌కు సత్కారం

నరసరావుపేట ఈస్ట్: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని సెలవుపై ఇంటికి వచ్చిన బీఎస్ఎఫ్ జవాన్ పఠాన్ గౌస్‌ను గురువారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జవాన్ గౌస్ తండ్రి సుభానీ కానిస్టేబుల్‌గా ఉద్యోగ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు లంకా రంగనాయకులు, ఉపాధ్యక్షుడు చేగిరెడ్డి ఈశ్వరరెడ్డి, కార్యదర్శి సి.సి.ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్‌కె ప్రసాదు, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గోళ్లమూడి చెరువును మోడల్‌గా అభివృద్ధి చేయాలి

- ఉపాధి హామీ పథకం రాష్ట్ర సంచాలకులు షణ్ముఖకుమార్
- గోళ్లమూడి, ఉప్పలపాడు గ్రామాల్లో పర్యటన



గోళ్లమూడి చెరువు వద్ద స్థానికులతో మాట్లాడుతున్న షణ్ముఖకుమార్

పెదకాకాని: గోళ్లమూడి తాగునీటి చెరువును మోడల్‌గా అభివృద్ధి చేయాలని ఉపాధి హామీ పథకం రాష్ట్ర సంచాలకులు వైవీ షణ్ముఖకుమార్ అన్నారు. పెదకాకాని మండలం గోళ్లమూడి, ఉప్పలపాడు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం నిర్వహణ పరిశీలన కోసం గురువారం రాష్ట్ర బృందం పర్యటించింది. షణ్ముఖ కుమార్ మాట్లాడుతూ గోళ్లమూడి గ్రామంలోని తాగునీటి చెరువును పల్లె పుష్కరిణి కింద చేపట్టి అభివృద్ధి చేయాలని సూచించారు. తాగునీటి అవసరాలపై గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం ఉప్పలపాడు గ్రామంలో పంట కుంట(ఫాం పాంట్స్) తవ్వుతున్న తీరును పరిశీలించారు. ఈ పనులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. శ్రామికులకు రోజువారి వేతనం కనీసం రూ.290 ఉండేలా చూడాలన్నారు. పంట కుంట నిర్మాణం చేపట్టిన రైతులతో మాట్లాడి సూచన చేశారు. అనంతరం లాలుపురం గ్రామంలో పర్యటించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ వి శంకర్, ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

మాచర్ల మండలం కొప్పునూరుకు చెందిన గొర్రెల కాపరిగా గుర్తింపు



బండారుపల్లి(తాడికొండ): పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందిన ఘటన తాడికొండ మండలం బండారుపల్లి గ్రామ పంట పొలాల్లో జరిగింది. వివరాల ప్రకారం.. మాచర్ల మండలం కొప్పునూరుకు చెందిన రేఖా ఆంజనేయులు గొర్రెల మందతో సంచరిస్తూ బండారుపల్లి గ్రామ పంట పొలాల్లో మధ్యాహ్నం సమయంలో విరామం కోసం చెట్టు కిందకు వెళ్లాడు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో చెట్టుపై పిడుగు పడటంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వెంట ఉన్న కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపించినట్లు సీఐ కె వాసు తెలిపారు.

పిడుగుపాటుకు గేదె మృతి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ ప్రాతూరులో పిడుగు పాటుకు గురువారం ఒక పాడి గేదె మృతి చెందింది. తాడేపల్లి పశువైద్యులు డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రాతూరు గ్రామానికి చెందిన మోటేపల్లి సాయిచందు అనే రైతు ఏడు గేదెలను పెంచుతున్నాడని, ప్రతి రోజు గడ్డి కోసం కృష్ణానది తీరానికి తీసుకువెళతాడని, మధ్యాహ్నం 3 గంటల సమయంలో పిడుగులతో కూడిన వర్షం పడింది. గేదెలు మేస్తున్న దగ్గరగా పిడుగు పడడంతో ఒక పాడిగేదె మృతి చెందిందన్నారు.

జీఎస్టీతో వేగంగా ఆర్థికాభివృద్ధి

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్



సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్‌ను అభినందిస్తున్న ట్రేడ్ వర్గాలు

లక్ష్మీపురం: వస్తు సేవల పన్నుతో దేశం వేగంగా ఆర్థికంగా ముందుకు వెళుతుందని, పన్ను వ్యవస్థ పూర్తిగా చక్కబడిందని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్ అన్నారు. గురువారం గుంటూరు కన్నవారితోటలోని జీఎస్టీ భవన్‌లో ప్రీ జీఎస్టీ డే వేడుక నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ జీఎస్టీతో పన్నులను అంగీకరించే సమాజం ఏర్పడిందన్నారు. పన్ను చట్టాల్లో పారదర్శకత పెరగటమే కాకుండా, పన్ను అధికారులకు, పన్ను చెల్లింపుదారుల మధ్య స్నేహభావం ఏర్పడిందన్నారు. ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడం, పన్ను చెల్లింపులు పెంచడం వంటి అంశాలలో జీఎస్టీ ప్రాధాన్యతను వివరించారు.

జీఎస్టీ విజయవంతంగా అమలు కావడంలో పరిశ్రమ భాగస్వాముల సహకారాన్ని అభినందించారు. జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జీఎస్టీ ప్రయాణాన్ని గుర్తుచేసే ఒక ముఖ్యమైన కార్యక్రమంగా ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరరావు మాట్లాడుతూ జీఎస్టీ ప్రారంభంలో తెలియక చాలా మంది వ్యాపారులు తమ రిటన్స్‌లో తప్పుడు వివరాలు నమోదు చేశారని, ప్రస్తుతం జీఎస్టీ ఆడిట్‌లో అవన్నీ పట్టుబడుతున్నాయన్నారు. అవి కావాలని చేసిన తప్పులు కావన్నారు. నేషనల్ కనూస్యూమర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు చదలవాడ హరిబాబు మాట్లాడుతూ ప్రాణ రక్షణ కోసం వాడే మందులపై జీఎస్టీని తక్షణమే తీసివేయాలన్నారు. చేనేత మగ్గాలపై విధించే ఐదు శాతం పన్నును కూడా రద్దు చేయాలన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీఎస్టీపై వ్యాపారుల ఇబ్బందులను ప్రతి మూడు నెలలకొకసారి అధికారులు సమీక్ష చేయాలన్నారు. ఇండియన్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ రేట్లలో రెండు స్లాబులే ఉండాలని సూచించారు. పలువురు పరిశ్రమ ప్రతినిధులు జీఎస్టీ అంశాలపై తమ అభిప్రాయాలను తెలిపారు. కమిషనర్ సుజిత్ మల్లిక్‌ను ట్రేడ్ వర్గాల వారు సన్మానించారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, బి.రవికుమార్, వి. వెంకటేశ్వరరావు, మనోజ్ కుమార్, మరియదాసు, రాయలు, ఆనందరావు, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

4న మెగా యోగా కార్యక్రమం

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర–2025లో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీ ఉదయం స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం ఎదురు రోడ్‌లో నగర ప్రజలు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్స్‌తో కలిసి మెగా యోగా కార్యక్రమం చేపట్టనున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో గుంటూరు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా అవగాహన కల్గించడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నగరంలో యోగా శిక్షకులను గుర్తించి, వారి ద్వారా క్షేత్ర స్థాయి వరకు యోగాపై ప్రజలకు తెలియచేస్తామన్నారు. ఆసక్తి కలిగిన ప్రజలు వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా కాని యోగాంధ్ర వెబ్ సైట్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజల్లో మరింతగా యోగా పట్ల అవగాహన కలిగించడం కోసం జూన్ 4న ఎన్టీఆర్ స్టేడియం ఎదురు లక్ష్మీపురం మెయిన్ రోడ్‌ని యోగా రోడ్‌గా ప్రకటించి, సదరు రోడ్‌లో ఉదయం పెద్ద ఎత్తున ప్రజలతో యోగా కార్యక్రమాలు చేపడతామన్నారు.

మరింత మెరుగ్గా కార్గో సర్వీసు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : ఏపీఎస్ ఆర్టీసీకి సంబంధించి కార్గో సర్వీసులో నూతన విధానాన్ని తీసుకొచ్చినట్లు రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. దీనిలో భాగంగా 250 గ్రాముల నుంచి ఐదు కిలోల వరకు వస్తువులు పంపించే విధానానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 250 గ్రాముల లగేజీని కొరియర్‌గా, 250 గ్రాములు దాటి ఉన్న లగేజీని పార్శిల్‌గా పిలవడం జరుగుతోందన్నారు. జూన్ 1 నుంచి ఈ విధానం బస్సుల్లో ప్రారంభమవుతోందని వివరించారు. 75 కిలో మీటర్ల వరకు 250 గ్రాములకు సంబంధించి రూ. 60లు, అదే దూరానికి ఐదు కిలోల వరకు రూ. 80లు, 76 కిలో మీటర్ల నుంచి 200 కిలో మీటర్ల వరకు 250 గ్రాములకు రూ. 90లు, అదే దూరానికి ఐదు కిలోలకు రూ. 95లు, 201 కిలో మీటర్ల నుంచి 500 కిలో మీటర్ల వరకు 250 గ్రాములకు రూ. 120, అదే దూరానికి ఐదు కిలోలు అయితే రూ. 275లు వసూలు చేయడం జరుగుతోందని తెలిపారు. లగేజీని, కొరియర్‌ను భద్రంగా అతి తక్కువ సమయంలో గమ్యస్థానానికి చేర్చడం జరుగుతుందన్నారు. లగేజీ తీసుకునేటప్పుడు తప్పనిసరిగా సంబంధిత డ్రైవర్, కండక్టర్ వద్ద రిసీవర్ సెల్‌కు వచ్చిన కోడ్‌ను చెప్పి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

తప్పిపోయిన చిన్నారి

గంట వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగింత



తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ వినోద్‌కుమార్, సిబ్బంది

మంగళగిరి టౌన్: ఇంటి వద్ద ఆడుకుంటూ తప్పిపోయిన ఓ చిన్నారిని కేవలం గంట వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన మంగళగిరిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి అజయ్‌నగర్‌కు చెందిన తేజస్విని అనే పాప ఇంటి వద్ద ఆడుకుంటూ తప్పిపోయి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏడుస్తూ కనిపించింది. అదే సమయంలో విధుల్లో ఉన్న సీఐ వినోద్ కుమార్ కంటపడింది. వెంటనే చిన్నారి వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అజయ్‌నగర్ అని, తండ్రి పేరు విజయ్ అని చెప్పడంతో ఆ చిన్నారిని తీసుకుని అజయ్‌నగర్‌లోని పాప నివాసానికి వెళ్లి తేజస్విని తండ్రికి అప్పగించారు. తప్పిపోయిన చిన్నారి సురక్షితంగా ఇంటికి రావడంతో సీఐ వినోద్‌కుమార్‌కు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పవిత్ర పూజాక్షేత్రంగా ఓంకారాశ్రమం

- ఆశ్రమంలో ఓంకారేశ్వరస్వామి ఆలయం
- ఆరంభమైన ప్రతిష్టా మహోత్సవాలు



ఓంకారేశ్వరస్వామి ఆలయం



ఓంకారేశ్వరస్వామి



యాగశాలలో ప్రతిష్టా మహోత్సవ పూజలు

తెనాలి: ఆంధ్రా ప్యారిస్ తెనాలిలోని బుర్రిపాలెం రోడ్డులో తొమ్మిది దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన ఓంకారాశ్రమం ఇప్పుడు పవిత్ర పూజాక్షేత్రంగా భక్తులకు అందుబాటులోకి వచ్చింది. రూ.కోట్ల విలువైన ఆస్తులున్నా స్వార్థపరుల కారణంగా కునారిల్లుతూ వచ్చిన ఆశ్రమమిది. ఆశ్రమ స్థలాన్ని పవిత్ర సందర్శనీయ స్థలంగా చేయాలని గత ప్రభుత్వ హయాంలో దేవదాయశాఖ సంకల్పించింది. అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో నిధులు మంజూరయ్యాయి. ఫలితంగానే ఇప్పుడు ఆశ్రమ స్థలంలో పరివార దేవతా, శిఖర, ధ్వజస్తంభ, శ్రీశరభ సాళ్వేశ్వరస్వామి, శ్రీపార్వతీ సమేత శ్రీఓంకారేశ్వరస్వామి వార్ల ఆలయం నిర్మించారు. ప్రతిష్టా మహోత్సవాలు గురువారం నుంచి ఆరంభించారు. తెనాలి బుర్రిపాలెంరోడ్డులోని ఓంకారాశ్రమం 1932లో ఏర్పాటైంది. కాకుమాను శ్రీరాములు అనే ఆధ్యాత్మిక చింతనాపరుడు ఆశ్రమాన్ని స్థాపించారు. సాధువులు ధ్యానం చేసుకునేందుకు, వారి పోషణ కోసమనే భావనతో ఏర్పాటైన ఆశ్రమానికి అప్పట్లో శ్రీవ్యాస ఆశ్రమ నిర్వాహకుడు మలయాళస్వామి శంకుస్థాపన చేశారు. ఆశ్రమం తరపున పేదలకు వైద్యం, విద్యార్థులకు విద్య కోసమని దాతలు 12.83 ఎకరాల మాగాణి భూమిని సమకూర్చారు. దాతల లక్ష్యం నిర్విఘ్నంగా నెరవేరింది. యజ్ఞయాగాది క్రతువులు వైభవంగా జరిగాయి. అప్పట్లో ఆశ్రమానికి స్వామీజీలు ట్రస్టీలుగా ఉండేవారు. 1947–1963 మధ్య ఆశ్రమానికి గల మాగాణి భూమిని విక్రయించారు. ఆ డబ్బుతో గంగానమ్మపేటలో ఉన్న శ్రీవేణుగోపాల స్వామి గుడి వీధిలో రెండు ఇళ్లు, చెంచుపేటలోని గోడౌన్ కొనుగోలు చేశారు.

ట్రస్టీల వ్యవహారంలో వివాదాలు

మలయాళస్వామి మరణంతో ఆశ్రమ ట్రస్టీల వ్యవహారంలో వివాదాలు మొదలయ్యాయి. 1980 వరకు పరంపరగా సాగాయి. అనంతరం ట్రస్టీలు ఏర్పాటైనా 1996లో ఆశ్రమ నిర్వహణ దేవదాయ, ధర్మదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. అప్పట్నుంచి అభివృద్ధి శూన్యమైంది. పైగా 1983లో ఆశ్రమంలో గల ధ్యానమందిరాన్ని కూల్చారు. 1998లో ఆశ్రమ స్థలంలోని 80 సెంట్ల స్థలాన్ని ఓ ప్రైవేటు విద్యాసంస్థకు లీజుకిచ్చారు. కోర్టు వివాదంతో ప్రైవేటు విద్యాసంస్థకు లీజు ఆగిపోయింది.

లాడ్జికి అద్దెకు ఇచ్చిన భవనం

శ్రీవేణుగోపాలస్వామి గుడి వీధిలోని భవనాన్ని గతంలో కొంతకాలం లాడ్జికి అద్దెకిచ్చారు. కొన్ని నెలలు రిక్రియేషన్ క్లబ్ కూడా నడిచింది. దేవదాయశాఖ చర్యలతో ఏడాదికి రూ.5.23 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. ఆశ్రమానికి 2022లో అవుతు శ్రీనివాసరెడ్డి ఈవోగా వచ్చారు. వేలం ఆదాయం పెరిగేలా చూశారు. అప్పట్నుంచి ఏడాదికి రూ.7 లక్షలకు పైగా ఆదాయం లభిస్తోంది. నిరుపయోగంగా ఉన్న ఆశ్రమ స్థలాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చేందుకు చేసిన కృషి ఫలించింది. 1.40 ఎకరాల ఆశ్రమం స్థలం ముందుభాగంలో ఆలయం నిర్మాణానికి 2023 డిసెంబరులో శంకుస్థాపన చేశారు. దేవదాయశాఖ రూ.26.66 లక్షలు, ఆశ్రమ నిధులు రూ.13.34 లక్షలు, దాతల సహకారంతో నిర్మాణం పూర్తయింది.

రేపు ప్రతిష్టా మహోత్సవం

ఈనెల 31వ తేదీన ఉదయం 8.19 గంటలకు ప్రతిష్టా మహోత్సవం జరగనుంది. గురువారం వేదస్వస్తి పూర్వకంగా యాగశాల ప్రవేశం చేసి, సంప్రదాయ పూజలను ఆరంభించారు. రెండురోజుల పూజల అనంతరం 31న యంత్రబింబ, ధ్వజ ప్రతిష్టలు, కళాన్యాసము, ప్రాణప్రతిష్ట జరుగుతాయి. ప్రతిష్టా కార్యక్రమాల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, దేవదాయశాఖ డీసీ కె.బసవ శ్రీనివాసరావు పాల్గొంటారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని ఈఓ అవుతు శ్రీనివాసరెడ్డి తెలిపారు.